## అత్త - కోడలు

అత్తా కోడలూ వున్న యింట్లో అన్నీ పేచీలే! "అందుకే అత్తలేని కోడలు వుత్తమురాలు! కోడలులేని అత్త గుణవంతురాలు" అన్నారు. ఇక కథలోకి వద్దాం. ఒక యింట్లో అత్త, కోడలు, కొడుకు వున్నారు. అత్తా కోడళ్ల పొత్తు జొన్నపొత్తని వేరే చెప్పాలా? అత్త ఒక రోజు వంటచేస్తే కోడలు రెండవ రోజు వంటచేస్తూ, జీవితరథాన్ని సాఫీగా నడిపించేస్తున్నారు. ఒకరోజు అత్త వండిన వంటకాన్ని కోడలు చెప్పుతూ, "అబ్బే! అన్నంలోని కేమీ లేదు! యేంవేసుకొని తినడం" అని గర్జించింది. అత్త గబగబా వచ్చి, "అయ్యో! కోడలా! యేమీ లేకపోతే తలుపువేసుకొని తిను. లేకపోతే పీటవేసుకొని తిను" అంది బఢాలున బాంబు ప్రేల్చినట్లు పాపం! కోడలు చిన్నపోయింది. అయినా ధీర వనితలు! వీరవనితలు! అపజయానికి శంకిస్తారా? తిరిగి ప్రతీకారముచేయుటే వారి పరమావధి. మరునాడు కోడలు అన్నంలోనికి యేమీ ఆధారం చెయ్యకుండా వట్టి అన్నమే వార్చిపెట్టింది. ఇది చూసి అత్త "అయ్యో కోడలు పిల్లా! నీమొగుడు యేంపెట్టుకు అన్నం తింటాడే"అంది మాటవరసకి. వెంటనే కోడలు "ఆ! సింగినాథం జీలకర్ర! గోచీపెట్టుకుతింటాడు" అంది. అప్పుడు అత్తగారి బుర్రలు "అవును! కుక్క కరిస్తే దానికి చెప్పుదెబ్బే! మనమేలాగు ప్రవర్తిస్తే అలాగే ఫలం వస్తుంది. మనకు టకటకా!!! యెటువంటి సమాధానము చెప్పింది" అని ప్రతిఫలించాయి యీ వూహలు. కాని మానధనురాలు అత్త యీ పరాభవాన్ని భరించగలదా? వెంటనే "ఏ పిల్లా! యిలాగ సెంకి జబాబులిస్తే? పుట్టింటికి పంపించేస్తా!" అని మొరిగింది. "చిత్తం! తమకి తోచింది చెయ్యండి" అంది కోడలు కులుకుతూ. ఆహా! అఖిలాంధ్ర అత్తాకోడండ్రమధ్య యిట్టి సుహృద్భావము వేయి సంవత్సరములు వెలుగొందుగాక!!! జై అత్తాకోడండ్ర అవినాభావ సంబంధానికీ జై! ఆంధ్రనాయకుల ఐకమత్యాన్ని మరిపిస్తున్నాదీకథ! లేరా గాయక వీరా! పాడురా" జయ జయ జయహే" అని అత్త కోడండ్రకి జయ గీతాలు. చిత్రించురా! కవికుమారా! ఇట్టి ఆదర్శ అత్తా కోడండ్ర జీవితం.

పి. యస్. నారాయణ.

* * *

## ప్రేమ దంపతుల సయ్యాటలు

రాత్రి 9-30 గంటలైంది. అప్పుడే 'అందాజ్' పిక్చరు చూసి వచ్చారు నవీన దంపతులు. వారి హృదయాల్లో క్రొంగొత్తభావాలు పరుగులు తీస్తున్నాయి. పిక్చరులోని ప్రేమదంపతుల సయ్యాటలు మరుపుకు రావటం లేదు. వారిలా రౌండుటేబిలుచుట్టూ పరిగెత్తాలని సయ్యాటలు ఆడాలని మూర్తికి కోరిక పుట్టింది. జంకుతూ మూర్తి తన కోర్కెను వెళ్ళబుచ్చాడు భార్యకు.

క్రొత్తరోజులు కదండీ! ఎవరికైనా అనుమానంగానే ఉంటుంది. సిగ్గుతో భర్తకు ఎదురుచెప్పడాన్కి గుండెలు లేక తప్పనిసరిగా వప్పుకుందామె. కానీ ఏం లాభం? వారిదగ్గర టేబిలు లేకపోయింది. మూర్తి ఆలోచించాడు దీర్ఘముగా. అటకమీద ఉన్న ఊరగాయ జాడీని క్రిందికి దించాడు. గది మధ్య భాగంలో దాన్ని పెట్టి రౌండుటేబులులా భావించుకున్నారు ఆ ప్రేమ పక్షులు.

" నీపాటలు నర్గీసువైతే
నా వీక్షను కపూరుదైతే
ప్రేమపక్షుల్లా విహరిద్దాం
స్వేచ్ఛవాయువులు పీలుద్దాం!"

ఇరువురిలో ఉద్రేకం హెచ్చయింది. నాళాల్లో వేడిరక్తం ప్రవహిస్తూంది. జాడీచుట్టూ పరిగెడ్తున్నారు. సెకెండ్లు గడుస్తున్నాయి...నిమిషాలు పరిగెడుతున్నాయి. ఆమె జడలోని సంపంగెలు క్రిందకు రాల్తున్నాయి. మూర్తి చమట బిందువులు కూడా రాల్తున్నాయి. ఒక్కొక్కప్పుడు ఆమె వాలుజడ మూర్తి నడుముకు హంటర్‌లా తగులుతూంది. ఆ దెబ్బలు మూర్తిని వేరే ప్రపంచంలోకి తీసుకుపోతున్నాయి.

ఆమె అలసిపోయింది. కాళ్ళు పట్లు పట్టాయి. ఆ వేగాన్ని ఆపుకోలేక ఆమె అమాంతంగా జాడిమీద పడ్డది. ఆమె కాలుతగిలి మూర్తికూడా ఆమెమీద...

కొంప మునిగింది. జాడీ బ్రద్దలయింది. ఊరగాయ (పాపం! మూర్తికి ఎంతో ఇష్టం) నేలపాలయింది. వారిలో సలసల మరిగే రక్తం చల్లబడ్డది. మనస్సులలోని కోర్కెలు ఎగిరిపోయాయి. రెండు రోజులు వళ్ళునొప్పులతో కాళ్లు పీకులతో బాధపడ్డారు.

మానం భుజంగరావు.

## ప్రియురాలా?

... రచన: "మోహన్‌బాబు" ...

*

పరిమళపుష్పము నీవైతే
మకరందమునుగ్రోలు భ్రమరము నేనౌదు,
చుక్కల్లో చంద్రుడ్ని నేనైతే—
చుక్కల్లో నీవొక చుక్కవుదు
ప్రేమ సౌధాన్ని నిర్మిద్దామా ?
ప్రియురాలా
ప్రణయ సామ్రాజ్యము నేలుదామా ?
ప్రియురాలా !!

* * *

రమ్యతరాజిల్లు రమణీయ ప్రకృతిలో
కడురమ్యముగ ఆడుకుందామా ?
ప్రియురాలా !
కమ్మగా సంగీతం పాడుకుందామా ?
ప్రియురాలా !!